క్లుప్తంగా

70 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

టంగుటూరు: టంగుటూరు టోల్‌ప్లాజా సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే –16లో ఎల్‌వీ ప్రసాద్‌నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 70 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు కంటిచూపు స్పష్టంగా ఉండాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉంటారన్నారు. వైద్యులు, టోల్‌ప్లాజా మేనేజర్లు నాగేశ్వరరావు, సాంబయ్య పీఆర్వో నర్సింగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదగాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకుని రావాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

8 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పానుగోటివారిపాలెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న పానుగోటి జగన్ బెల్టుషాపుపై శనివారం ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితున్ని అదుపులోనికి తీసుకున్నారు.

85 మందికి వైద్య పరీక్షలు


హనుమంతునిపాడు కేజీబీవీలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: మండలంలోని కేజీబీవీలో శనివారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు దార్ల సందీప్‌కుమార్, ఎం భార్గవిలు మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో 50 మందికి, కోటతిప్పలలో 35 మందికి పరీక్షలు చేశామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంఈఓ ఎస్.రమణయ్య, ఎస్‌ఓ అంజమ్మ, సీహెచ్‌ఓ కెవి.చెన్నయ్య, టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆయాలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కొండపి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరులు, డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగ యువతలకు బాగా డిమాండ్ ఉన్న కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి వారికి స్థానికంగా ఉన్నటువంటి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్లో 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల కలిగి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులకు మూడు నెలల పాటు, సీయింగ్ మెషిన్ ఆపరేటింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 20వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల న్నారు. ఇతర వివరాలకు 8897964505 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హక్కులపై అవగాహన అవసరం

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం, బాలోత్సవాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ చైర్మన్ బొబ్బరాజు సుబ్బారావు మాట్లాడుతూ బంగారు బాల్యం చాలా విలువైందన్నారు. బాల్యం నుంచే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు బి. నాగయ్య, వెంకట్రావు, రమణారెడ్డి, ఓబులేష్, వెంకటయ్య, శేషారెడ్డి, షేక్ రహనా, లీలావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం


పామూరు వల్లీభుజంగేశ్వర ఆలయంలో జ్వాలాతోరణం

పామూరు: స్థానిక వల్లీ సమేత భుజంగేశ్వర ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు. ముందుగా వల్లీ, భుజంగేశ్వర ఉత్సవమూర్తులకు విశిష్ట పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముసురు ముంచుతోందా..?

వర్షంతో కొంత మోదం.. కొంత ఖేదం

- ముసురుతో పంటలను ఆశిస్తున్న తెగుళ్లు
- అన్నదాతల్లో ఆందోళన
- తక్షణ చర్యలతో పంటలకు రక్షణ

కనిగిరి రూరల్:

అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షం కొన్ని పంటలకు మేలు చేకూర్చనుండగా.. ముసురు వాతావరణంతో మరికొన్ని చేలకు తెగుళ్ల ఆశించనున్నాయి. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఖరీఫ్ సాధారణ వీస్తీర్ణం 54 వేల ఎకరాలు ఉండగా, రబీ సాధారణ విస్తీర్ణం 45 వేల ఎకరాలు. అయితే సాగు విస్తీర్ణం 55 వేల ఎకరాలు, రబీ 50 వేల ఎకరాలు సాగు విస్తీర్ణం ఉన్నట్లు, ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం కంటే సాగు విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఉద్యాన పంటలు సాధారణ విస్తీర్ణం 2,449 హెక్టార్లు కాగా 2 వేల హెక్టార్ల వరకు సాగు చేశారు. సబ్ డివిజన్‌లో ప్రధానంగా కంది, వరి, పొగాకు, మినుము తదితర పైర్లు వేశారు. నియోజకవర్గంలో కంది 15,487 హెక్టార్లు, వరి 500 హెక్టార్లు, సజ్జ 1,496 హెక్టార్లు, పొగాకు 400 హెక్టార్లు, మినుము 700 హెక్టార్లు, ఇతర పంటలు 200 హెక్టార్ల వరకు సాగు చేసినట్లు అంచనా. నాల్గు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పాటు, నెలకొన్న ముసురు వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కంది, వరి, మినుముకు మేలు జరగనుంది. అయితే వాటికి పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుంది. పొగనారుమళ్లు వేసిన రైతులు కూడా నారుమళ్లు దెబ్బతింటుందని ఆందోళనచెందుతున్నారు. కనిగిరి మండలంలో ఖరీఫ్, రబీకి సంబంధించి కంది 6,770 హెక్టార్లలో, మినుము 800 హెక్టార్లలో (పెరిగే అవకాశం ఉంది), వరి 350 హెక్టార్లలో (పెరిగే అవకాశం), పొగాకు సుమారు 800 హెక్టార్లు, బొబ్బర్లు 250 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు వ్యవసాయ అధికారి పి.జోత్స్నాదేవి తెలిపారు.

- ఉల్లికోడు తెగులుకు బెల్ట్ ఎక్స్‌పర్ట్ 100 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కాండం కుళ్లు తెగులుకు హెక్సా కావోజోల్ 2 ఎంఎల్, లీటర్ నీటిలో, ప్రాపికోనాల్ 1ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి


పొగాకునారుమళ్లు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.



నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కందిలో పూత పురుగు, మారుక పుచ్చ పురుగు, శనగ పచ్చ పురుగు ఆశిస్తాయి. వరిలో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. రైతులు తగు మోతాదులో పురుగుమందులు పిచికారీ చేస్తే వాటిని నివారించవచ్చు.

పి జోష్నా దేవి(వ్యవసాయ అధికారి, కనిగిరి)


కంది పైరు

కంది పైరు ప్రస్తుతం క్లై దశలో ఉంది. ముసురు వాతావరణంతో పూత పురుగు, మారుక మచ్చ పురుగు, శనగ పచ్చ పురుగు ఆశిస్తున్నాయి.
నివారణ చర్యలు: వేప నూనె 5 ఎంఎల్ లీటరు నీటికి, ఎసీఫెట్ 1.5గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ముందస్తు జాగ్రత్త చర్యలతో పంటను కాపాడుకోవచ్చు. ఫోటో16కెఎన్‌జిఆర్01 కంది పైరు


మినుము పంట

మినుము, పెసర, బొబ్బర పంటలు ప్రస్తుతం శాఖీయ దశ నుంచి పూత దశ వరకు ఉన్నాయి. ఈ పంటలను ఆకులను తినే పురుగు ఆశిస్తాయి.
నివారణ చర్యలు: క్లోరిపైరిపాస్ 20 ఈసీ 2.5ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి


వరి పైరు

కనిగిరి ప్రాంతంలో ప్రస్తుతం వరి పంట పిలక దశనుంచి దుబ్బు దశ, కంకి దశలో ఉంది. దీన్ని కాండం తొలుచు పురుగు, ఆకు చుట్ట పురుగు, ఉల్లి కోడు పురుగు ఆశిస్తోంది.
నివారణ చర్యలు: కాండం తొలుచు పురుగుకు ఫ్లూ బైండ మైండ్ 0.2ఎంఎల్ కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రామ్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బాల్య వివాహాలను అరికట్టాలి


కంబాలదిన్నె జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ర్యాలీ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రవిచంద్రబాబు

పొన్నలూరు: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు పేర్కొన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల్లో స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు బాల హక్కులు వారి అభివృద్ధి సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశ నుంచే విద్య పట్ల ఆసక్తి కలిగి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. బాలికలు చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వల్ల సాధికారతను కోల్పోతారన్నారు. ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలను ఉపయోగించుకోని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
పామూరు: బాల్య వివాహాలు ఆరోగ్యానికి అనర్థమని, బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాలపై, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కంబాలదిన్నె జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పీఎం ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని కంబాలదిన్నె జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం హెచ్‌ఎం పీయం.ఖాన్, స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో బాలల వారోత్సవాల్లో మన కోసం మనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం, సూపర్‌వైజర్‌లు మాట్లాడుతూ బాలికల సంపూర్ణ అక్షరాస్యతతోనే బాల్యవివాహాలు నిరోధించడం సాధ్యమన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, పురుషులకు 21 ఏళ్ల, మహిళలకు 18 ఏళ్ల నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే ఐసీడీఎస్, పోలీస్, స్వచ్ఛందసంస్థల వారికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పీఈటీ నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో రైతులకు మేలు

పొన్నలూరు: గోకులం షెడ్లు నిర్మించుకోవడం వల్ల రైతులకు, పశుపోషకులకు మేలు జరుగుతుందని ప్రత్యేకాధికారి డి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని ముత్తరాసుపాలెంలో నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ పొన్నలూరు మండలంలో మొత్తం 25 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వీటిలో 12 షెడ్లు నిర్మాణ పనులను లబ్ధిదారులు మొదలు పెట్టారన్నారు. ఉపాధి హామీ నుంచి 90 శాతం రాయితీతో నిధులు మంజూరు చేస్తుండగా, లబ్ధిదారుడు 10 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.


ముత్తరాసుపాలెంలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారిని వరలక్ష్మి

పీసీపల్లి: మండలానికి మంజూరైన గోకులం షెడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోగా 18 పంచాయతీల్లో మంజూరైన గోకులం షెడ్లను పూర్తి చేసేలా చూడాలని, లేకుంటే సంబంధిత శాఖాధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి


బోడవాడలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రాధ


మాట్లాడుతున్న ఏఓ జోత్స్నాదేవి

కనిగిరి రూరల్: రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని బడుగులేరు, పునుగోడు గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తి పెరుగుతున్న కారణంగా మూడేళ్ల నుంచి ఉంటున్న డిమాండ్, ధరలు ప్రస్తుతం ఉంటాయని ఊహించలేమని స్పష్టం చేశారు. అనుమతి మేరకే పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటలైన కంది, మిరప, అలసంద, బొబ్బర్లు, తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల రైతుకు ఆర్థిక లబ్ధి జరుగుతుందని తెలిపారు. వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కాశీరావు, రాజేష్, భరత్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పామూరు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సన్నద్ధం కావాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని బోడవాడలో శనివారం పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పొగాకు బోర్డువారు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే బ్యారన్ పరిధిలో రైతులు పొగాకు సాగు చేయాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న కలంలో పొగాకుకు మంచి ధర ఉంటుందని నిర్దిష్టంగా చెప్పలేమని, ఇతర దేశాల్లో కూడా రైతులు పొగాకు అధిక విస్తీర్ణంలో సాగుచేసి ఉన్నారని ఆధిక దిగుబడి పొగాకు మనకంటే ముందుగా మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు నష్టపోకుండా ఇతర ప్రత్యామ్నాయ పంటలు జొన్న, శనగ, అలసంద, మొక్కజొన్న, మినుము పంటలను సాగుచే సుకోవాలన్నారు. వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి రూరల్: పట్టణంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు సహరించాలని ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి


అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో శనివారం 2025–26 గ్రామ పంచాయతీ ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఎస్‌లు, డిజిటల్ అసిస్టెంట్, వీఓఏలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రాధాన్యతా క్రమంలో అంతర్గ సీసీరోడ్లు, తాగునీరు, డీబ్‌బోర్లు, పారిశుధ్యం మొదలైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అయా పంచాయతీల్లో ప్రాముఖ్యతను సంతరించుకున్న సమస్యల పరిష్కారానికి కూడా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, సర్పంచ్‌లు, పీఎస్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.
మర్రిపూడి: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు శిక్షణ నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టే పనులను ముందుగా గుర్తించాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మెరుగుపరచాల్సిన ఆవశ్యతక ఉందన్నారు. పంచాయతీల్లో ఉన్న కోద్దో గొప్పో నిధులతో వీధిలైట్లు, బ్లీచింగ్ చల్లించేందుకు సరిపోతుందన్నారు. అందరూ సహకరిస్తే మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీడీఓ జగదీష్, కాశింపీరా, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో బూచేపల్లి, దద్దాల


గుంటూరి వారి వివాహ వేడుకల్లో బూచేపల్లి, దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని దిరిశవంచ పంచాయతీ సర్పంచ్ గుంటూరి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసమ్మల కుమారుడు గుంటూరు మల్లికార్జున రావు వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. నూతన వరుడిని ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, కటికల వెంకట రత్నం, జి.బొర్రారెడ్డి, కాసుల గురవయ్య యాదవ్, విజయ భాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, చింతం శ్రీనివాసుల యాదవ్, స్వర్ణ ఏడుకొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జరిగిన పలు వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు దాసరి మురళీ, చింతం శ్రీనివాసుల యాదవ్, సయ్యద్ నాయబ్ రసూల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

కొండపి: కందుకూరు కోర్టు లీగల్ సెల్ ఆథారిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మహిళలకు చట్టాలు, సంక్షేమ పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కందుకూర్ కోర్టు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పి. ఫణికుమారి, కె. సులోచనలు పాల్గొని మహిళలు నేటి సమాజంలో చట్టాలు తెలుసుకొని మంచిగా మెలగాలని, గృహ హింస చట్టం, మనోవృత్తి వరకట్నం, సంక్షేమ పథకాలు, తదితర చట్టాలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు చట్టాలు తెలుసుకొని ధైర్యంగా పోరాడి గౌరవ జీవితం గడపాలని తెలిపారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పెరుగు శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ చట్టపరమైన అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సుకు కొండపి ఏపీఎం బి. గోపీనాథ్ అధ్యక్షత వహించగా, హైకోర్టు జూనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కందుకూర్ కోర్టు వారు సభలో పాల్గొన్న వారికి జ్యూట్ బ్యాగులను అందించారు. తహసీల్దార్ పి. మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు, డీఆర్‌డీ డీపీఓ నరసింహారావు, ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఎంఈఓ– 2 రామారావు, పారా లీగల్ వలంటీర్లు హరిబాబు, మస్తాన్, కోర్టు సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న అధికారులు

నేడు వగ్గంపల్లెలో ఉచిత వైద్య శిబిరం

పామూరు: మండలంలోని వగ్గంపల్లె గ్రామంలోని పాత సచివాలయ ప్రాంగణంలో ఆదివారం మల్లికార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైద్యశిబిరంలో ఉచితంగా ఓపీతో పాటు మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు, పరిసర గ్రామ ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిదిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయినుండి బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండిశెట్టి వెంకటరమణయ్య అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురంలో శనివారం పార్టీ మండల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్లాడుతూ గ్రామ స్థాయినుండి పార్టీ సభ్యత్వ నమోదుచేయాలన్నారు.

కొనసాగుతున్న విస్తరణ పనులు


చెప్పల్ బజార్‌లో విస్తరణ పనులు

కనిగిరి రూరల్: ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో శనివారం కూడా విస్తరణ పనులు చేపట్టారు. మున్సిపాలిటీలోని ప్రధాన సెంటర్ అయిన చెప్పల్ బజార్ (నాజ్ సెంటర్ టు ఓవీ రోడ్డు వరకు) రోడ్డు విస్తరణ పనులు మున్సిపల్ అధికారులు నిర్వహించారు. రెండు పొక్లెయిన్ల సాయంతో రోడ్డుకు ఇరువైపులా మెట్లను, తాత్కలిక నిర్మాణాలు, రేకులను తొలగించారు. గతంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలు పూర్తిగా బయట పడే విధంగా, మున్సిపల్ స్థలం వరకు తొలగింపు చేపట్టారు. కార్యక్రమంలో టీపీఎస్ సువర్ణ కుమార్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు


హెచ్‌ఎంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినిలు


టంగుటూరులో నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు వర్ధనరాజు

హనుమంతునిపాడు: జ్ఞాన సముపార్జన కోసం గ్రంథాలయాలు ప్రతి గ్రామంలో అవసరమని ఎంఈఓ ఎస్ .రయణయ్య, హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బరావు, గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రత వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఏర్పాటుకు పోరాడిన అమరవీరులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథ్, పాతూరి నాగభూషణం చిత్ర పటాలకు పూలమాలేసి నివాళర్పించారు. అనంతరం వారు గ్రంథాలయాల ఏర్పాటుకు చేసిన పోరాటం, కృషిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తరువాత విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.
టంగుటూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథ, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకుడు వర్ధనరాజు విద్యార్థులకు పోటీలు నిర్వహించి, పలు పుస్తకాలు చదివించారు.